క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో శుక్రవారం జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతిలో ఈ నెల 7న నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాయకులు ద్యాగ శేఖర్, నరేష్, అనిల్ సాయి, సంతోష్, నవీన్, మల్లేష్, సాగర్, వినయ్ పాల్గొన్నారు.

నందిపేట పోలీస్ స్టేషన్ తనిఖీ



నందిపేట్: నందిపేట్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఏసీపీ జగదీష్ చందర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అంతకుముందు ఏసీపీకి వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు సన్మానం చేశారు. ఎస్సై రాహుల్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: పట్టణంతోపాటు మండలంలోని ఇస్సాపల్లి, రాంపూర్ గ్రామాల పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో కావాల్సిన సదుపాయాలను గుర్తించి వాటిని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఆయన పేర్కొన్నారు. మండలంలో మొత్తం 86 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఆర్ఐ అశోక్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

మన ఊరు- మన బడి పనులు..



రెంజల్(బోధన్): మండలంలోని ప్రభుత్వ బడుల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను డిప్యూటీ జెడ్పీ సీఈవో వరదరాజన్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా రెంజల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఎఫ్‌సీ, 15వ ఫైనాన్స్ నిధుల వినియోగంపై రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రెంజల్, దూపల్లి హైస్కూళ్లలో జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌస్‌లు ఉన్నారు.

ఆర్మూర్‌ను అభివృద్ధి చేస్తాం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నూతన బ్లేడ్ ట్రాక్టర్‌ను ఆమె ప్రారంభించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ..పట్టణంలో ప్రజలు పారిశుద్ధ్యలోపంతో ఇబ్బందులు పడకుండ ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్ను, కమిషనర్ ప్రసాద్ చౌహన్, సానిటరి ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



రుద్రూర్: మండలంలోని రాయకూర్ గ్రామానికి చెందిన బుషీగాం సుధాకర్‌గౌడ్ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యమాద్రి భాస్కర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. నాయకులు స్వామి యాదవ్, మల్యాద్రిరెడ్డి, భూపాల్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్ ఉన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కమ్మర్‌పల్లి: సమగ్ర శిక్షలో పని చేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిప్యూటీ తహసీల్దార్‌కు మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం వినతిప్రతం అందజేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి గంగమణి, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పూర్తయ్యేదెన్నడో?

- బోధన్– సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వరకు నాలుగులైన్ల రోడ్డు మంజూరు
- గతేడాది పనులు ప్రారంభం
- ఇప్పటికీ పూర్తికాని వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సాలూర -సాలూర క్యాంప్ గ్రామాల మధ్య నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

బోధన్: పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వరకు చేపట్టిన నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనుల పురోగతిలో జాప్యం జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పనులు నిలిచిపోయాయి. అసంపూర్తి పనులు, రోడ్డుపై గుంతల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.35 కోట్లు మంజూరు..

సాలూర మండల కేంద్రానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంత 63వ నెంబర్ జాతీయ రహదారికి అనుసంధానంగా బోధన్ నుంచి రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం రూ. 35 కోట్లు మంజూరు చేసింది. నేషనల్ హైవే అథారిటీ పనులను పర్యవేక్షిస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో పట్టణ శివారు నుంచి సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వరకు 8.3కి.మీల విస్తరణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివారులో పాత డబుల్ బీటీ రోడ్డు విస్తరణ పనులతోపాటు మూడు గ్రామాల శివారులో 4.5 కి.మీ పొడువున పంట పొలాల మధ్య బైపాస్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. పాత రోడ్డు పక్కన స్థలాన్ని విస్తరణకు గుంతలు తవ్వి కంకర డస్ట్‌తో నింపి చదును చేశారు. కానీ వర్షాలకు కంకర తేలింది. పంట కాలువల వద్ద సీసీ పైప్‌లు వేసిన చోట్ల గుంతలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులకు కష్టంగా మారింది.

ప్రమాదకరంగా గుంతలు..

నాగన్‌పల్లి గ్రామం వద్ద పసుపు వాగుకు రెండు వైపుల భారీ గుంతలు పడగా, అధికారులు కొన్ని చోట్ల కంకర వేసి పూడ్చారు. కంకర వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివారులో రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం కురిసిన సందర్భంలో నీరు నిలిచి గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు, బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సాలూర క్యాంప్ శివారులో..

రోడ్డు మరమ్మతులు చేపడుతాం..

రోడ్డు విస్తరణలో భాగంగా పాత బీటీ రోడ్డుకు ఏర్పడిన గుంతల వల్ల వాహనదారులుల ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపడుతాం. పాత రోడ్డు విస్తరణ పనులు, బైపాస్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వర్షాల వల్ల పనుల్లో కొంత ఆలస్యం జరుగుతోంది.

–కాంతారావు, ఎన్‌హెచ్ఏ ఆఫీసర్, నిజామాబాద్

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

- టీపీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి
- పలు మండలాల్లో పర్యటన



సాలూరలో సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

బోధన్/బోధన్‌టౌన్/ఎడపల్లి(బోధన్): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని టీపీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాలూర మండల కేంద్రానికి వచ్చిన మాజీ మంత్రికి మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత హామీల వల్ల ప్రజలు కష్టాలపాలయ్యారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసమే సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు, సిలిండర్ రూ. 500కే అందిస్తామని తెలిపారు. అంతకుముందు సుదర్శన్‌రెడ్డి బోధన్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఎడపల్లిలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. బోధన్‌కు వచ్చిన మాజీ మంత్రికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. నాయకులు తాహిర్‌బిన్, రమేష్, రవి, శంకర్, అశోక్, పులి శ్రీనివాస్, లింగం, కామప్పా, రత్నాకర్, సాయిరెడ్డి, గంగాధర్, పర్హాన్, పాషా మోయినొద్దీన్, హరికాంత్ చారీ, నాగేశ్వర్ రావ్, నరేందర్, నవీన్, ఖలీం, దాము, గంగాధర్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రసాద్, సాయిలు, భద్రరావ్, రవిదాస్, సాలూర క్యాంప్ సర్పంచ్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'తొలిమెట్టు' శిక్షణ



బోధన్‌లో మాట్లాడుతున్న ఎంఈవో నాగ్‌నాథ్

బోధన్: పట్టణంలోని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు తొలిమెట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా బోధన్ ఎంఈవో నాగ్‌నాథ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. భాష పరిజ్ఞానం, గణితం అంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా తొలిమెట్టు కార్యక్రమం అమలుకు ప్రణాళిక రూపొందించబడిందని పేర్కొన్నారు. డీఆర్‌పీలు హన్మాండ్లు, శివకుమార్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలకేంద్రంలో శుక్రవారం తొలిమెట్టు గణిత శిక్షణ శిబిరాన్ని ఎంఈవో వనజ సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనలో వినియోగించాలని పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోయా పంటలో నీరు నిల్వ ఉండొద్దు



ఖండ్‌గాంలో మాట్లాడుతున్న అధికారులు

బోధన్: సోయా పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ రైతులకు సూచించారు. మండలంలోని కల్దుర్కి, సిద్ధాపూర్, ఖండ్‌గాం గ్రామాల్లో శుక్రవారం ఆయన వివిధ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాలు తగ్గిన తర్వాత సోయా పంటకు ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ ఎరువులను వేయాలని సూచించారు. ఏడీఏ సంతోష్, ఏఈవోలు ఉన్నారు.

పంటల పరిశీలన..

నందిపేట్: మండల కేంద్రంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పరిహారం కోసం బాధిత రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లను ఏఈవో కార్యాలయంలో ఇవ్వాలని ఏవో జ్యోత్స్న భవాని సూచించారు. అధికారులు అనూష, విజయ్, గంగాధర్, వీడీసీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతుల దీక్షలు



రెంజల్(బోధన్): మండలకేంద్రంలోని బందల్ల రోడ్డు నిర్మాణం కోసం స్థానిక రైతులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 38వ రోజు కొనసాగాయి. రైతులకు మద్దతుగా రెంజల్ మాదిగ సంఘ సభ్యులు దీక్షలు నిర్వహించారు. అలాగే మాజీ మంత్రి, టీపీసీసీ కోశాధికారి సుదర్శన్‌రెడ్డి సైతం రైతుల దీక్షకు మద్దతు తెలిపారు. రైతులు 38 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు ఆలసత్వం వల్ల రోడ్డు పనులను నిలిచిపోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అధికారుల పనిచెప్తానన్నారు. రెండు నెలల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి





ఆర్మూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న జీపీ కార్మికులు.. నవీపేట్‌లో కార్మికులకు అన్నదానం చేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్/నవీపేట/వర్ని: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని జీపీ కార్మికులు డిమాండ్ చేశారు. పలు మండలాల్లో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. ఆర్మూర్‌లో జీపీ కార్మికులు ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, టీజీకేఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నవీపేటలో సమ్మెలో ఉన్న జీపీ కార్మికులకు ఫకీరాబాద్ గ్రామానికి చెందిన మాజీ కో–ఆప్షన్ సభ్యుడు జావీద్ తన తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. మోస్రాలో జీపీ కార్మికుల సమ్మెకు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దిష్టిబొమ్మను వర్నిలో జీపీ కార్మికులు దహనం చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌డీఎస్‌ఎల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) కార్మికులు శనివారం నుంచి ఫ్యాక్టరీ ప్రధాన గేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. లేఆఫ్ కాలం నాటి నుంచి రావాల్సిన బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఫ్యాక్టరీని తెరిపించాలనే డిమాండ్లతో దీక్షలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అఖిల పక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకులను దీక్షల ప్రారంభోత్సవానికి ఆహ్వానించామన్నారు.

పశువులకు టీకాలు



గొట్టిముక్కలలో టీకాలు వేస్తున్న పశువైద్యులు

మాక్లూర్: మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో మండల పశు వైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహేర్ ఆధ్వర్యంలో శుక్రవారం పశు వైద్యసిబ్బంది పశువులకు నట్టల నివారణ మందు వేశారు. పశువైద్య సిబ్బంది వినిత, జైల్‌సింగ్, గంగాజమున, శ్రీనివాస్, సాజిద్, దిలీప్, బేగ్ ఉన్నారు.

వేల్పూర్: మండలంలోని అమీనాపూర్, లక్కోర గ్రామాలలో శుక్రవారం గొర్రెలు, మేకలు, పశువులకు నట్టల నివారణ మందును పశువైద్య సిబ్బంది వేశారు. సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి





అన్నారంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అన్నపూర్ణ.. అమ్దాపూర్ గ్రామంలో..

డొంకేశ్వర్/పెర్కిట్/నందిపేట్/రెంజల్(బోధన్): బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డకు తొలి టీకా వంటిదని, వ్యాధి నిరోధక శక్తి కలిగి ఉంటాయని తెలిపారు. అలాగే ఆర్మూర్ మండలం అమ్దాపూర్ గ్రామంలో సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ తల్లిపాల విశిష్టతపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. నందిపేట్‌లో సూపర్‌వైజర్ రేఖ, రెంజల్ మండలంలోని కాసాన్‌తండాలో సూపర్‌వైజర్ ప్రమీలారాణీ మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ మండలం కిసాన్‌తండాలో..

సంక్షిప్తం

పిరమిడ్ పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై నిర్మిస్తున్న శ్రీ నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంనిర్మాణ పనులను శుక్రవారం కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్, నందీశ్వర మహారాజ్‌తో పాటు కమిటి సభ్యులు పరిశీలించారు. కమిటీ సభ్యులు ఉన్నారు.

రుద్రూర్‌లో ఔషధ మొక్కల దినోత్సవం

రుద్రూర్: మండల కేంద్రంలో శుక్రవారం ఆయుర్వేద శిరోమణి ఆచార్య బాలకృష్ణ 52వ జయంతి పురస్కారించుకుని పతంజలి యజ్ఞ సహిత యోగ సమితి ఆధ్వర్యంలో ఔషధ మొక్కల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఆయుర్వే ఔషధ మొక్కలు నాటారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు

రుద్రూర్/వర్ని: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జైలు శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడంతో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా కోటగిరి, వర్ని మండలాల్లో పార్టీ నాయకులు టపాసులు కాలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబురాలు చేసుకున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రెంజల్(బోధన్): రైతులకు రూ. లక్ష రుణమాఫీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మండలంలోని కూనేపల్లి, కళ్యాపూర్ గ్రామాల్లో శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి..

భీమ్‌గల్: మండలకేంద్రంలో శుక్రవారం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. రేవంత్‌రెడ్డి హెచ్చరించడంతోనే ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించిందని, అందుకే రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు బొదిరె స్వామి తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని వరద బాధితులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి సరఫరా చేసిన నిత్యావసర సరుకులను శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు అందజేశారు.

మాక్లూర్: మండలంలోని వరద బాధితులకు రాకేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను, టార్పాలిన్లను పంపిణీ చేశారు.

ప్రహరీ పనులకు భూమిపూజ

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్‌లో కబరస్తాన్(స్మశానవాటిక) ప్రహరీ నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచ్ ఎఖార్‌పాష భూమిపూజ నిర్వహించారు. బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

పే స్కేల్‌తో ఉద్యోగులకు గుర్తింపు

భీమ్‌గల్: పే స్కేల్ వల్ల సెర్ప్ ఉద్యోగులకు గుర్తింపు వచ్చిందని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో సెర్ప్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కుంట గంగారెడ్డికి సన్మానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో గంగామోహన్, డీపీఎం శ్రీనివాస్, ఎంపీఎంలు పాల్గొన్నారు.


ఈవ్ టీజింగ్‌పై షీటీంకు సమాచారం ఇవ్వాలి

వేల్పూర్: మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ చేసినా ఆర్మూర్ సబ్ డివిజన్ షీ టీంకు సమాచారం ఇవ్వాలని షీ టీం కానిస్టేబుళ్లు సుమతి, విఘ్నేష్ ఒక ప్రకటనలో తెలిపారు. షీ టీం నంబరు 8712659795కు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.

ఆలయంలో అన్నదానం

బల్కొండ: మండల కేంద్రంలోని నిమిషాంబ దేవి ఆలయంలో నకాసీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో పూజలు నిర్వహించారు.

బస్‌పాస్ ఖర్చుల అందజేత



వర్ని: చందూర్ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మాధవ రెడ్డి శుక్రవారం మండలంలోని 100 మంది దివ్యాంగులకు బస్‌పాస్‌కు అయ్యే ఖర్చులను అందజేశారు. ఆర్టీసీ సిబ్బంది, గ్రామస్తులున్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్

మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ వద్ద గల విజయ్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. అన్నోర ఫార్మా కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్‌లో డిప్లొమా, ఫార్మసీకి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు.

మంత్రి ధన దాహానికి రైతులు బలి



మోర్తాడ్(బాల్కొండ): మంత్రి ప్రశాంత్‌రెడ్డి ధన దాహానికి రైతులు బలి అయ్యారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని సుంకెట్‌లో చెక్‌డ్యాం తెగిపోయి పంటలను కోల్పోయిన బాధిత రైతులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. చెక్‌డ్యాంల నిర్మాణంలో నాణ్యతా లోపం, డిజైనింగ్ లోపాలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సరిచేయిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. నాయకులు ముత్యాల రాములు, నాయకులు ఆనంద్, సుధీర్, సాయిరెడ్డి, గంగాధర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గురిజాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అడవిపందుల దాడిలో మక్కపంట ధ్వంసం



బాల్కొండ: ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామ శివారులో మక్క పంటను గురువారం రాత్రి ధ్వంసం చేశాయని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిర రైతు ఆకుల రాజేశ్వర్‌కు చెందిన అర ఎకరం పంటను పందులు ధ్వంసం చేశాయి. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో సైతం మక్క పంటను అడవిపందులు ధ్వంసం చేశాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మెగ్-2(ఇంగ్లీష్)2డీ-11.10,1.50 4.30,7.10,9.50

స్క్రీన్-2 – బ్రో (తెలుగు) - 10.50, 1.45, 4.40, 7.35, 10.30

స్క్రీన్-3 – ఎల్‌జీఎమ్(తెలుగు)- 11.50, 6.00, కృష్ణగాడు అంటే ఒక రేంజ్ -3.05 బ్రో (తెలుగు) - 9.15


స్క్రీన్-4 – బేబి-12.35, 6.30, 10.00 మిస్టేక్(తెలుగు)- 4.05

బాధ్యతల స్వీకరణ

బోధన్ ఏసీపీగా..

బోధన్: బోధన్ ఏసీపీగా కిరణ్ కుమార్ శుక్రవారం మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల వ్యక్తిగత సెలవుపై వెళ్లిన ఏసీపీకి ఆకస్మికంగా బదిలీ చేస్తూ హైదరాబాద్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెనువెంటనే విజయ సారథి బోధన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కిరణ్‌కుమార్ బదిలీ రద్దు కావడంతో బాధ్యతలు తీసుకున్నారు.

తహసీల్దార్లుగా..



బోధన్ తహసీల్దార్‌ను సత్కరిస్తున్న ఆర్డీవో

బోధన్‌రూరల్/ఎడపల్లి/నవీపేట/బాల్కొండ: బోధన్ తహసీల్దార్‌గా గంగాధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాన్సువాడ నుంచి బోధన్‌కు బదిలీపై వచ్చారు. ఆర్డీవో రాజాగౌడ్ తహసీల్దార్‌ను సత్కరించి, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే నవీపేట తహసీల్దార్‌గా ధన్వాల్ బాధ్యతలు స్వీకరించారు. బాల్కొండ తహసీల్దార్‌గా అడేపు శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఎడపల్లి తహసీల్దార్‌గా మోతిసింగ్ బాధ్యతలు స్వీకరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 9951027699
రాంనాథ్ (నిజామాబాద్ అర్బన్ & రూరల్) : 7997958181
ఎ.శివ (ఆర్మూర్) : 9848956776
పి.కళ్యాణ్ (బోధన్) : 83281 91021
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899